

బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ : వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.



పోటెత్తిన భక్తులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండతీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను రుచి చూస్తున్న జడ్జి ప్రేమలత

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. జిల్లా జడ్జి ఎస్.ప్రేమలత, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించి ఫుడ్ ఫెస్టివల్‌లో జిల్లాలోని మహిళా పోలీసు అధికారులు, పోలీసు కుటుంబసభ్యులు చేసిన పలు రకాల వంటలను ప్రదర్శించారు. 24 స్టాల్స్ ఏర్పాటు చేయగా. ముగ్గురికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప అవార్డు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోగులకు మెరుగైన వైద్య సేవలు, వసతులు కల్పించే ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే కాయకల్ప అవార్డు ఈఏడాది జిల్లాలోని ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి దక్కిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాబు తెలిపారు. అవార్డు ఎంపికకు అధికారుల బృందం పలుమార్లు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నిర్వహణ, పచ్చదనం, ఓపీ సేవలను పరిశీలించారన్నారు. స్వచ్ఛభారత్, పోషణ అభియాన్, బయో మెడికల్ వేస్టేజ్, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్, సిబ్బంది శుభ్రత వంటి వాటిపై సంతృప్తి వ్యక్తం చేసి అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. రూ.లక్ష నగదు ప్రోత్సాహాన్ని ఆసుపత్రికి అందించారన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యతో పాటు కంప్యూటర్ నైపుణ్యం అవసరం



మాట్లాడుతున్న డీఈఓ రమేశ్ కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులకు పాఠశాలలో అందించే విద్యతో పాటు మెరుగైన ఆలోచన విధానాన్ని, సామర్థ్యాన్ని అందించే కంప్యూటర్‌లో నైపుణ్యం అవసరమని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అన్నారు. సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను మంగళవారం పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. కంప్యూటర్ నాలెడ్జ్ విషయమై ప్రశ్నలు అడుగుతూ విద్యార్థులు చెప్పిన సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్‌లో విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పడిన కంప్యూటర్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ విద్యాసాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి బడిబాటలో పాల్గొన్నారు.

ధాన్యం తరుగు ఎక్కువ వేస్తున్నారని రైతుల ధర్నా



ఇల్లంతకుంట(సిరిసిల్ల): మండలంలోని గాలిపల్లి గ్రామంలో ధాన్యం క్వింటాల్‌కు 10 కిలోల వరకు తరుగు పెడుతున్నారని నిరసిస్తూ రైతులు రోడ్డుపై ధాన్యం బస్తాలు వేసి మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇతర గ్రామాల్లో క్వింటాల్‌కు రెండున్నర కిలోలు తరుగు తీస్తే గాలిపల్లి పీఏసీఎస్ పరిధిలో మాత్రం 10 కిలోలు తరుగు తీస్తున్నారని అన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడగా తహసీల్దార్ వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని కూర్చున్నారు. తహసీల్దార్ నరేందర్ చేరుకుని ధాన్యం తరుగు పెట్టకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

పరిశ్రమలతో సుస్థిర ఉపాధి

- పెట్టుబడులకు తెలంగాణ కేంద్రబింధువు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- కలెక్టరేట్‌లో పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు



వెల్ది హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, టీపీటీడీసీ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్



దళితబంధు ప్రదర్శనను తిలకిస్తూ..

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు తీస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో చేనేత, జౌళిశాఖ, పరిశ్రమల శాఖ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. తెలంగాణాలో పారిశ్రామిక ప్రగతి వేగంగా విస్తరిస్తుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. జిల్లాలో రూ.727 కోట్లతో 697 యూనిట్లు కొత్తగా ఏర్పాటు చేశారని, తద్వారా 7,965 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అపెరల్ పార్క్‌లో గోకుల్‌దాస్ గార్మెంట్ పరిశ్రమతో 600 మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని వివరించారు. తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ ఒకప్పుడు ఉరిసిల్లాగా ఉన్న సిరిసిల్ల రాష్ట్ర ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో ముఖచిత్రం మారిందన్నారు. బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు రూ.3వేల కోట్లు అందించి వస్త్రపరిశ్రమను ప్రభుత్వం ఆదుకుందని తెలిపారు. నేత కార్మికులకు 10శాతం యారన్ రాయితీ ఇస్తున్నామని, పింజర్ల డబ్బులు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. సిరిసిల్లలో వర్కర్ టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైందని వివరించారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మధ్యమానేరు జలాశయానికి భూములు ఇచ్చి, ఇళ్లు కోల్పోయిన ముంపు గ్రామాల నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించాలని కోరారు. ముంపు గ్రామంగా ప్రకటించిన సంకెపల్లిలో 150 ఎకరాల్లో ఆగ్రో ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, ×సెస్× చైర్మన్ చిక్కాల రామారావు, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కమలాకర్, పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, టెక్స్‌టైల్ పార్క్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, జౌళి శాఖ ఏడీ సాగర్, సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి యెల్దండి దేవదాస్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షులు, పారిశ్రామికవేత్తలు, ఆసాములు, యజమానులు, నేత కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

మెప్మా, మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైన్స్ స్టాల్, దళిత బంధు ఫొటో ప్రదర్శన, డాక్యుమెంటరీలు ఆకట్టుకున్నాయి. నేతకళాకారుడు వెల్ది హరిప్రసాద్, చేనేత కార్మికులను, గోకుల్‌దాస్ సంస్థ ప్రతినిధిని ఈ సందర్భంగా సన్మానించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: ఈనెల 11న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాల్లో 4,261 మంది అభ్యర్థులు పరీక్ష రాయబోతున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అభ్యర్థులు విధిగా హాల్‌టికెట్లు తెచ్చుకోవాలని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని, ఉదయం 8.30 గంటల నుంచి 10.15 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈవో రమేశ్‌కుమార్, ఉద్యాన వన అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి భాస్కర్, మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

8న రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడ: వేములవాడ రాజన్న హుండీ లెక్కింపు ఈనెల 8న స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆయన ఉత్తర్వులు వెలువరించారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్లఅర్బన్: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం వేములవాడ, సిరిసిల్లలోని సుందరయ్యనగర్, తంగళ్లపల్లి, నేరేళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 392 మందికి పరీక్షలు చేయగా.. ఇందులో థైరాయిడ్ 57, సీబీపీ 63 మందికి పరీక్షలు నిర్వహించినట్లు, విటమిన్ డీ లోపం 31 మంది, 57 మందిలో సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లు గుర్తించారు. పలు ఆరోగ్య సమస్యలు ఉన్న 16 మందిని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మూలవాగును మూసీగా మార్చారు'

వేములవాడ: వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామంటూ ఊదరగొడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు మూలవాగును మూసీ నదిగా మార్చారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మూలవాగు వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మూలవాగును జీవనదిలా మార్చుతామంటూ ఇటీవల కొత్తపాట అందుకున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు మురికినీటితో నిండిపోయి మూసీనదిలా మారడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గుడి చెరువులోకి మురికి నీరు పంపిస్తూ కలుషితం చేస్తున్నారని అన్నారు. మూలవాగు ఒడ్డునే వాకింగ్ ట్రాక్ కడుతామంటున్నారు మరి ఈ మురికినీటి పక్కనే వాకింగ్ చేయాలా? అంటూ ఎద్దేవ చేశారు. వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన పార్క్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. 24 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని లేకుంటే ప్రజలతో కలిసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. నాయకులు సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, పాత సత్యలక్ష్మి, చంద్రశేఖర్, దేవయ్య, కృష్ణ, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లమాస్కులు ధరించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సమ్మె బాటలో టెక్స్‌టైల్ కార్మికులు

- నేడు ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 10 శాతం యారన్ సబ్సిడీ చెల్లించాలని డిమాండ్
- సమస్య పరిష్కారం కాకుంటే నిరవధిక సమ్మె వైపు అడుగులు



సారంపల్లి-బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సారంపల్లి-బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు కార్మికులు బుధవారం ఒక్కరోజు సమ్మె బాట పట్టారు. సానుకూల స్పందన రాకుంటే నిరవధిక సమ్మె చేసేందుకు వెనుకాడమని సంకేతాలు ఇస్తున్నారు. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపల్లి-బద్దెనపల్లి పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కు ద్వారా ప్రస్తుతం సుమారు 500 మంది నేత కార్మికులు పనిచేస్తున్నారు. పరోక్షంగా 300 మంది ఉపాధి పొందుతున్నారు. అయితే 2వేల నేత కార్మికుల కుటుంబాలకు ప్రత్యక్షంగా మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి మార్గాన్ని చూపడం ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతూ వస్తోంది. దీంతో తరచూ కార్మికులు సమ్మెబాట పట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

పత్తాలేని 10 శాతం యారన్ సబ్సిడీ

పవర్‌లూమ్ కార్మికులకు మెరుగైన ఉపాధి మార్గం చూపేందుకు ప్రభుత్వం బతుకమ్మ చీరెల తయారీని చేపట్టింది. కార్మికులు ఈ చీరెలను నేసిస్తే వారికి నూలు సబ్సిడీ రూపంలో నగదు ప్రోత్సాహకాన్ని ఇస్తోంది. దీంతో పాటు నేసిన బట్టకు కూలిని కూడా అందిస్తోంది. దీంతో కార్మికుల ఆర్థిక కష్టాలు దూరమవుతాయని ప్రభుత్వం ఆలోచన చేసింది. అయితే 10శాతం యారన్ సబ్సిడీ అందించడంలో ఎనలేని జాప్యం జరుగుతోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. 2019కి సంబంధించిన సబ్సిడీని మాత్రమే అందించగా.. 2020, 2021, 2022 మూడేళ్ల 10శాతం యారన్ సబ్సిడీ రావాల్సి ఉందని వాపోతున్నారు.

పరిష్కారం కాని సమస్యలు..

టెక్స్‌టైల్ పార్కులోని సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రభుత్వం ఓవైపు మౌలిక సదుపాయాలకు రూ.కోట్లు వెచ్చిస్తుంటే.. కార్మికులకు మాత్రం ఆ సదుపాయాలు అందుబాటులోకి రావడం లేదు. కార్మికుల కోసం నిర్మించిన క్యాంటీన్ బుక్కెడు బువ్వ పెట్టలేకపోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులను యజమానులుగా మార్చేందుకు వర్కర్ టూ ఓనర్ పథకం అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

నేడు ఒక రోజు సమ్మె

సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7న ఒకరోజు సమ్మె చేసేందుకు కార్మిక సంఘాల నాయకులు ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. దీంతో బుధవారం 24 గంటల పాటు టెక్స్‌టైల్ పార్కులోని సాంచాలు మూగబోనున్నాయి. అధికారులు స్పందించి 10శాతం యారన్ సబ్సిడీని అందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో త్వరలో నిరవధిక సమ్మెకు వెళ్లినా ఆశ్చర్యం లేదని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.

రూ.40వేలు రావాలి



నాకు 2020 సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.40వేల యారన్ సబ్సిడీ రావాల్సి ఉంది. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరగా అందిస్తే పిల్లల విద్యకు ఉపయోగపడుతుంది.

– చౌటపల్లి శ్రీనివాస్, పవర్‌లూమ్ కార్మికుడు

యారన్ సబ్సిడీ అందించాలి



ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి 2020 సంవత్సరపు యారన్ సబ్సిడీని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమచేయాలి. అలాగే కార్మికులకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తేవాలి.

– కూచన శంకర్, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

నిలిచిన రూ.25 కోట్ల రాయితీ



జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ చీరెలు నేసిన కార్మికులకు 10శాతం యారన్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. అయితే 2020 నుంచి ఇప్పటి వరకు ఇవ్వలేదు.. దీంతో మూడేళ్లుగా సుమారుగా రూ.25 కోట్ల సబ్సిడీ పెండింగ్‌లో ఉంది.

– కోడం రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

వందేభారత్ వచ్చేస్తోంది!

- రెండోసారి ట్రయల్స్ పూర్తి
- త్వరలోనే ఖాజీపేట – బల్లార్ష మార్గంలో పరుగులు
- మూడో సర్వీసుగా నాగపూర్ – సికింద్రాబాద్ రైలు
- పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?
- ఉమ్మడి జిల్లాలో 100 కి.మీ. వేగంతో పరుగులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పూర్తిస్వదేశీ సాంకేతికతతో రూపొందిన సూపర్‌ఫాస్ట్ ట్రెయిన్ వందేభారత్ ఉమ్మడి జిల్లాలో కూత పెట్టనుంది. ఈనెలలో నాగపూర్ – సికింద్రాబాద్ మధ్య రైలు ప్రారంభానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ఈరైలు రెండుసార్లు ట్రయల్ రన్ పూర్తిచేసుకుంది. సోమవారం కూడా రైలు ఎక్కడా ఆపకుండా సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 100 కి.మీ. వేగంతో నడిపినట్లు తెలిసింది. మే నెలలో తొలిసారి వందేభారత్ రైలును ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ట్రయల్ రన్ చేపట్టగా సకాలంలో గమ్యస్థానం చేరుకుందని సమాచారం. ప్రస్తుతం సికింద్రాబాద్ – విశాఖపట్నం, సికింద్రాబాద్ – తిరుపతి రూట్లలో వందేభారత్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సికింద్రాబాద్ – నాగపూర్ రూట్‌లో పరుగుతో రికార్డునెక్కనుంది.

రామగుండం, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?

అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన వందేభారత్ రైలు.. సికింద్రాబాద్ – ఖాజీపేట, ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో త్వరలో పరుగులు తీయనుంది. ఇటీవలే ఈ సెక్షన్‌లో మూడోలైన్ కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరిగింది. ఇదే సెక్షన్ మీదుగా వందేభారత్‌ను సికింద్రాబాద్ టు నాగపూర్ వరకు ట్రయల్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 581 కిలో మీటర్లు. సాధారణ రైళ్లకైతే ఈ రెండు నగరాల మధ్య 10 గంటలకుపైగా సమయం పడుతోంది. వందేభారత్ రైలైతే 6.30 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకునే వీలుంది. మొన్న జరిగిన పరీక్షల్లో రైలు కేవలం ఆరు గంటల్లోనే చేరుకుందని సమాచారం. మిగిలిన అర గంటలో హాల్టింగ్‌ల సమయాన్ని తీసేసినా.. ఆరున్నర గంటల్లో చేరుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెద్దపల్లి, రామగుండం, ఉమ్మడి ఆదిలాబాద్‌లో మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందులో మార్పులు కూడా ఉండవచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

ట్రాక్‌ల సామర్థ్యం పెంపు..

రైలు పరుగుపెట్టనున్న నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ట్రాక్‌స్పీడ్ పెంచారు. సికింద్రాబాద్ పరిధిలో ఖాజీపేట – బల్లార్ష రూట్‌ను అప్‌గ్రేడ్ చేశారు. దాదాపు 130 కి.మీ. వేగంతో ఈ మార్గంలో రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట – రామగుండం వరకు, పెద్దపల్లి – మెట్‌పల్లి వరకు కనిష్టంగా 90 కి.మీ. నుంచి గరిష్టంగా 130 కి.మీ. వరకు వేగంగా వెళ్లేలా ట్రాక్‌లు రెడీ చేశారు. భవిష్యత్తులో వందేభారత్ రైలును పెద్దపల్లి – కరీంనగర్, కరీంనగర్ – జగిత్యాల, జగిత్యాల – నిజామాబాద్ రూట్లలోనూ నడపగలిగితే.. పొరుగున ఉన్న మహారాష్ట్రకు కేవలం మూడు, నాలుగు గంటల్లోనే చేరుకునే వీలుంటుంది. సిరిసిల్ల, జగిత్యాల విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, నేత, వలస కార్మికులకు ఇది ఎంతో అనువుగా ఉండనుంది.

రూట్	స్పీడు సామర్థ్యం(కి.మీ.లలో)
సికింద్రాబాద్ – బల్లార్షా	130
ఖాజీపేట – కొండపల్లి	130
సికింద్రాబాద్ – ఖాజీపేట	130
మానిక్‌నగర్ – విరూర్(3వ లైన్)	110
మందమర్రి – మంచిర్యాల(3వ లైన్)	110
మంచిర్యాల – పెద్దంపేట(3వ లైన్)	100
పెద్దంపేట – రాఘవపురం(3వ లైన్)	110
రాఘవపురం – కొలనూరు – పొత్కపల్లి(3వలైన్)	90
బిజిగిరీషరీఫ్ – ఉప్పల్(3వ లైన్)	100
పెద్దపల్లి – కరీంనగర్	100
కరీంనగర్ – జగిత్యాల(లింగంపేట)	90
జగిత్యాల(లింగంపేట) – నిజామాబాద్	100
మేడ్చల్ – మనోహరాబాద్ సెక్షన్	110

జగిత్యాల రూట్‌లో నడపాలి



జగిత్యాల రూట్‌లో చాలామంది ఎక్స్‌ప్రెస్ సర్వీసు కోసం ఎదురు చూస్తున్నారు. పెద్దపల్లి – జగిత్యాల మార్గంలో వందేభారత్ రైలు నడిపితే ముంబై వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పుడు 10 గంటల సమయం పడుతుంది. రూ.2 వేల ఖర్చవుతుంది. వందేభారత్ వస్తే.. వేగంగా ముంబై చేరుకుంటాం, ఖర్చు తగ్గుతుంది.

– నాగిరెడ్డి రాజిరెడ్డి, హార్వెస్టర్ యజమాని, జగిత్యాల

పెద్దపల్లిలో హాల్టింగ్ ఇవ్వాలి



ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో వందేభారత్ రైలు రానుండటం హర్షణీయం. దీంతో స్థానికులకు చాలామేలు జరుగుతుంది. పెద్దపల్లిలో హాల్టింగ్ ఉంటుందన్న ప్రచారంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లికి హాల్టింగ్ కల్పిస్తే నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ వాసులకు అనుకూలంగా ఉంటుంది.

– కొండి సతీశ్, ఆమ్ ఆద్మీ పార్టీ

క్లుప్తంగా

చెరువుల ఆక్రమణను అరికట్టండి


మాట్లాడుతున్న చొక్కాల రాము

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం తాము చేసిన ప్రగతి అంటూ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజాధనం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ప్రచారం చేస్తోందని, చెరువుల పండుగ కాదు.. చెరువుల ఆక్రమణను అరికట్టాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలువలు, కుంటలు, చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే చెరువుల కబ్జాపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌టీపీ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం


పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హాజరై భవిష్యత్ కార్యాచరణపై పార్టీ నాయకులతో దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి రమాకాంత్, లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాయికిరణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఏఈ ద్వారా మంజూరైన చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్‌జయంతిలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ పవర్ లూమ్ డెవలప్‌మెంట్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో చేతి వృత్తుల వారికి రూ.లక్ష సబ్సిడీ రుణాలు అందించేందుకు నిర్ణయించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన చేతి వృత్తులకు సంబంధించిన వారు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా బీసీడీవో నీల రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల 20లోపు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

సాహో.. సర్కార్ బడి

- కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడులు
- సిరిసిల్లలో మారిన 'బడి' ముఖచిత్రం
- సామాజిక బాధ్యతలో కార్పొరేట్
- 7వేల మంది విద్యార్థులకు వసతులు


ముస్తాబాద్‌లో రూపుదిద్దుకుంటున్న జెడ్పీ పాఠశాల భవనం

ముస్తాబాద్(సిరిసిల్ల): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. అంగన్‌వాడీ నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకునే వరకు ఒకే పాఠశాలలో విద్యను అందించే బృహత్తర పథకం సాకారం అవుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సర్కార్ బడులను ఆధునికీకరించే పనులు చివరి దశకు చేరుకున్నాయి. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ చొరవతో కార్పొరేట్ కంపెనీలు సామాజిక బాధ్యతగా అందించే సాయాన్ని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మళ్లించారు. కొండూరు సాంకేత్‌రావు పర్యవేక్షణలో కోట్లాది రూపాయలతో అధునాతన సౌకర్యాలు కల్పిస్తూ నిర్మాణాలు పూర్తి చేశారు.

ఆధునాతన భవనాలు

సిరిసిల్ల నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు మొదట గంభీరావుపేట జెడ్పీ పాఠశాలను ఎంచుకున్నారు. ఇక్కడ శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి అధునాతన పెద్ద భవనాన్ని నిర్మించారు. 3,500 మంది విద్యార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు సిరిసిల్ల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 1,000 మంది విద్యార్థులు చదువుకునేలా భవనం నిర్మించారు. ఇక్కడి సౌకర్యాలు, విద్య తీరు నచ్చడంతో వేలాది అడ్మిషన్లు వచ్చాయి. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లిలో 3,000 మంది విద్యార్థులు చదువుకునేలా చేపట్టిన భవన నిర్మాణాలు తుదిదశలో ఉన్నాయి. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటల్లో అంచెలంచెలుగా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యను ప్రవేశపెట్టనున్నారు.

భవనాల్లో మౌలిక వసతులు

సువిశాల ప్రదేశంలో వెయ్యి మంది విద్యార్థులు చదువుకునేలా భవనాల్లో మౌలిక వసతులు కల్పించారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, స్టాఫ్‌రూమ్స్, డిజిటల్ తరగతులు, డైనింగ్ హాల్, ప్లేగ్రౌండ్, పచ్చిక మైదానాలు, కిచెన్ షెడ్లు, కాన్ఫరెన్స్ హాల్స్ నిర్మించారు. అధునాతన ఫర్నిచర్, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రత్యేకంగా నిర్మించారు. వీటికి తోడు మన ఊరు మనబడి ద్వారా కొంత అభివృద్ధి పనులకు ఉపయోగించారు.

పల్లె ముంగిట ఉన్నత చదువులు

గ్రామాల్లో పదోతరగతి తర్వాత ఉన్నత చదువులకు దూర ప్రాంతాలకు వెళ్లలేని బాలబాలికలకు స్థానికంగా ఉన్నత విద్య అందించనున్నారు. అంగన్‌వాడీ నుంచి పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్న వారికి ఇంటర్, డిగ్రీ విద్యను అందించాలన్న సంకల్పంతో మంత్రి పనులు చేయిస్తున్నారు. దీంతో బాలికల చెంతకు ఉన్నత విద్య దరిచేరనుంది. ప్రస్తుత విద్య సంవత్సరం మరో పది రోజుల్లో ప్రారంభం అవుతుండగా కేటీఆర్ నిర్మిస్తున్న పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దృష్టి పడింది.

విద్యాభివృద్ధికి దోహదం


మేము చదువుకున్నప్పుడు ఇలాంటి సౌకర్యాలు లేవు. బాలికలకు ఒకేచోట డిగ్రీ, పీజీ విద్య అందించడం వరం. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్మించడం గ్రేట్. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదం చేస్తుంది.

– ప్రశాంతి, పూర్వ విద్యార్థిని, ఎల్లారెడ్డిపేట

బృహత్తర కార్యక్రమం


మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో ప్రభుత్వ విద్య అభివృద్ధి చెందింది. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు ఒకే చోట విద్యను అందించే బృహత్తర కార్యక్రమం రూపుదాల్చింది. పేద విద్యార్థులు, ముఖ్యంగా బాలికలకు ఒకేచోటే ఉన్నత విద్య అందుతుంది.

– తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

విద్యతోనే సమాజాభివృద్ధి


ప్రతీ వ్యక్తికి ఉన్నత విద్య అందుబాటులో ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. సీఎస్ఆర్ నిధులతో మంత్రి కేటీఆర్ గొప్ప విజన్‌తో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు నిర్మింపచేశారు. ఇతర జిల్లాల వారు అబ్బురపడేలా ఆధునిక వసతులతో కూడిన స్కూల్స్ నిర్మించారు.

– కొండూరు రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

గౌడ విద్యార్థుల అభ్యున్నతికి కృషి


మాట్లాడుతున్న రమేశ్‌బాబుగౌడ్

సిరిసిల్లఅర్బన్: గౌడ విద్యార్థుల అభ్యున్నతికి గోపా కృషి చేస్తుందని గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రమేశ్ బాబుగౌడ్ అన్నారు. మంగళవారం గోపా జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్‌గౌడ్ అధ్యక్షతన పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 100 మంది గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరగోని శ్రీనివాస్‌గౌడ్, ముద్దగోని రాంమోహన్‌గౌడ్, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, కన్వీనర్ బుర్ర నారాయణగౌడ్, గోపా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి లక్ష్మీనారాయణగౌడ్, కోశాధికారి బాలగౌడ్, ఉపాధ్యక్షులు నాగుల శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఎస్సైలు పిల్లి రాంచంద్రంగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, పలు మండలాల గోపా అధ్యక్షులు, కమిటీ సభ్యులు, గౌడ సంఘం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి

ఇల్లంతకుంట(సిరిసిల్ల): కేసీఆర్ నిరంకుశ పాలనకు ప్రజలు స్వస్తి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపల్లిలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందక అల్లాడిపోతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ ఉద్యోగాలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్, బాలపోచయ్య, సురేందర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కూతురుకు ప్రాణభిక్ష పెట్టండి

- ఆపన్న హస్తం అందించాలని వేడుకోలు
- మధుమేహంతో ఆస్పత్రిలో చేరిన మౌనిక


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌనిక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మధుమేహం వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న తన కూతురుకు దాతలు ఆపన్నహస్తం అందించి ప్రాణభిక్ష పెట్టాలని ఓ కన్న తల్లి వేడుకుంటోంది. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన కొండ సరోజన–శంకర్‌గౌడ్ దంపతుల కూతురు మౌనిక చిన్నతనంలోనే షుగర్ వ్యాధికి గురైంది. వ్యాధి తీవ్రత పెరిగి తీవ్ర అస్వస్థతకు గురైన మౌనికను కుటుంబసభ్యులు మొదట సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. చికిత్స కోసం రూ.5లక్షల వరకు ఖర్చు అవుతందని వైద్యులు తెలపడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్న హస్తం అందించి కూతురు ప్రాణాలు నిలబెట్టాలని కోరుతున్నారు. కనీసం మందులు కొనే పరిస్థితి లేకపోవడంతో ఆ దంపతులు దిక్కులు చూస్తున్నారు. సాయం అందించే వారు మౌనిక సోదరుడు కొండ బాబు ఫోన్‌పే నం .8187014482కు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాములు

సిరిసిల్లటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దాదాపు 50 కిలోమీటర్ల దూరం నుంచి భవన నిర్మాణ కార్మికులు పని కోసం సిరిసిల్లకు వస్తున్నారన్నారు. వీరికి ఎలాంటి కనీస మౌలిక వసతులను కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికా రుల ఆధ్వర్యంలో లేబర్ కార్మిక చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించి సమస్యలు పరిష్కరించా లన్నారు. ఈ సమావేశంలో నాయకులు అజ్జ వేణు, చంద్రమౌళి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సురేశ్ మృతదేహం


సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు ఇప్పలపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జెట్టి సురేశ్(35) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూరుకు చెందిన జెట్టి సురేష్ చేపలు అమ్ముకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో మొరం మట్టితో వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఘటనలో సురేశ్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


ఎల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారా యణపూర్‌కు చెందిన అవధూత ఎల్లయ్య (78) వృద్ధుడు వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లయ్య నాలుగు రోజుల క్రితం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారులు మారుతి, శ్రీనివాస్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంపులో పడిన వ్యక్తిని కాపాడిన 108 సిబ్బంది


సంపులో నుంచి బయటకు తీస్తున్న 108 సిబ్బంది

వేములవాడరూరల్: మిషన్ భగీరథ సంపులో పడిన వ్యక్తిని 108 సిబ్బంది కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. రాయికల్ మండలానికి చెందిన బాబు అగ్రహారం ప్రాంతంలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తాడు. మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కాగితాలు ఏరుకుంటూ మిషన్ భగీరథ సంపులో పడిపోయాడు. మూడు గంటల తర్వాత స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా అతడిని సంపులో నుంచి బయటకు తీసి కాపాడారు. ఎలాంటి ప్రాణహాని కలగకుండా కాపాడిన రమణారెడ్డి, పైలట్ బాలకృష్ణలను పలువురు అభినందించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి చర్యలు


యూనిఫాం అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ప్రజల శాంతిభద్రతల కోసం నిత్యం పనిచేసే పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 26 మంది డిస్ట్రిక గార్డు సిబ్బందికి జంగిల్ ప్యాచ్ డ్రెస్, జంగిల్ షూ, 200 మంది హోంగార్డ్స్ సిబ్బందికి యూనిఫామ్ క్లాత్, షూ అందజేశారు. ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు, యోగా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ బందోబస్తులు నిర్వహించే సమయాల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అన్నారు. ఆర్ఐ యాదగిరి, డిస్ట్రిక్ గార్డ్, హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి


మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

- డీఎస్పీ నాగేంద్రచారి

చందుర్తి(వేములవాడ): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. మంగళవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పోలీసు మీ కోసం కార్యక్రమంలో మాట్లాడారు. నిరంతరం ప్రజలకు కంటికి రెప్పలా కాపాడటమే పోలీసుల కర్తవ్యమని అన్నారు. యువత పట్టుదలతో చదువుకొని సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగినందున ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ద్విచక్రవాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని అన్నారు. గ్రామాల్లోనే ప్రతీ యువకుడు యూనిఫాం లేని పోలీసేనని గుర్తు చేశారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఐకేపీ వీవోఏలు


జాయినింగ్ లెటర్ అందజేస్తున్న వీవోఏ

చందుర్తి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 28రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన ఐకేపీ వీవోఏలు మంగళవారం విధుల్లో చేరుతున్నట్లు ఐకేపీ ఏపీఎం రజితకు జాయినింగ్ లెటర్లు అందజేశారు. మండలంలో 30 మంది వీవోఏలు ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే విధుల్లో చేరారు.

చెరువుల పండుగ నిర్వహణపై సర్పంచుల ఆగ్రహం


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచ్ పోచయ్య

తంగళ్లపలి(సిరిసిల్ల): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహించనున్న చెరువుల పండుగకు మాంసాహార భోజనం పెట్టాలని అధికారులు తెలపడం సరికాదని సర్పంచులు మండిపడ్డారు. మంగళవారం తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై సర్పంచులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో లచ్చాలు చెరువుల పండుగకు మాంసాహారంతో భోజనం ఏర్పాటు చేయాలని చెప్పడంతో ఒక్కసారిగా సర్పంచులు మండిపడ్డారు. మీరిచ్చిన నిధులు కోడిగుడ్డు పెట్టడానికి కూడా సరిపోవని, ఊరందరికీ మాంసం ఎక్కడి నుంచి తెచ్చి పెడతామని ప్రశ్నించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పై అధికారులు తమకు ఇచ్చిన ఆదేశాల మేరకు సూచిస్తున్నామని, దాతల సాయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ పడిగెల మానస, సర్పంచులు ముదారి పోచయ్య, గనప శివజ్యోతి, అంకారపు అనిత, నకిర్తీ బాలమల్లు, మాసిరెడ్డి అవినాష్ రెడ్డి, కాయితి బాలయ్య, ఈసరి ఉమరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ప్రధానం


కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వేములవాడ: జర్నలిస్టుల సంక్షేమమే ప్రధానమని టీయూడబ్ల్యూజే (హెచ్143), ఐజేయూ జిల్లా శాఖ అధ్యక్షుడు రాచర్ల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం వేములవాడ ప్రెస్‌క్లబ్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే కార్యక్రమాన్ని 80శాతం వరకు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు లాయక్‌పాష మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అల్లం నారాయణ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టుల్లో తమ ప్రతిభను పెంపొందించుకునేందుకు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

అధ్యక్షుడిగా కొలిపాక నర్సయ్య, ఉపాధ్యక్షులుగా రేగుల రాంప్రసాద్, ఎండీ అజీం, ప్రధాన కార్యదర్శిగా ఆయాచితుల జితేందర్, కోశాధికారిగా నరెడ్ల కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పొన్నం శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కోత్వాల్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా ఎండి రియాజ్, కార్యవర్గ సభ్యులుగా దుబ్బెట ప్రవీణ్, పర్శరాం, జిల్లా రమేశ్, బండి రజనీకాంత్, మహమ్మద్ జునేద్, గౌరవసలహాదారులుగా సయ్యద్ లాయక్‌పాషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

14న వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఈ నెల 14న శంకుస్థాపన చేయనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను మంగళవారం కలిసిన అనంతరం శంకుస్థాపన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, వేద పండితులు వరప్రసాదచార్యులు, రాచర్ల రఘురామశర్మలు శంకుస్థాపన చేయనున్న ట్లు తెలిపారు. వినోద్‌కుమార్‌ను కలిసిన వారిలో ఆ లయ కమిటీ చైర్మన్ కిషన్, మాజీ ఏఎంసీ చైర్మన్ సు భాష్, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఆలయం ఎదుట గుండెపోటుతో భక్తురాలి మృతి


లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

వేములవాడ: ఎములాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన లక్ష్మి (55) భక్తురాలు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్‌కు చెందిన లక్ష్మి తన కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 5న వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆరోజు దర్శన భాగ్యం కలగలేదు. దీంతో ఆలయ ఆవరణలోనే రాత్రి బస చేశారు. మంగళవారం వేకువజామున రాజన్నను దర్శించుకునేందుకు సమాయత్తమవుతున్న క్రమంలో తాను ఆలయ ఆవరణలోనే ఉంటానని లక్ష్మి తన కుటుంబసభ్యులకు చెప్పడంతో వారంతా రాజన్నను దర్శించుకొని తిరిగి లక్ష్మి వద్దకు చేరుకున్నారు. ఎంత పిలిచినా పలకకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అప్పటికే ఆమె గుండెపోటుతో తుదిశ్వాస విడిచింది. దీంతో కుటుంబసభ్యులంతా బోరున విలపించారు. కాగా లక్ష్మి అరుపులు, కేకలు వేసినా ఎవరూ స్పందించకపోవడంతోనే మృత్యువాత పడినట్లు మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. రాజన్నకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా.. ఆలయ ఆవరణలో కనీసం ప్రాథమిక చికిత్స అందుబాటులో లేకపోవడం బాధాకరమని భక్తులు వాపోయారు.